సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 12 । జనవరి । 2025



పండక్కి వస్తానంటివే.!

పండక్కి ఇంటికి వచ్చేస్తానమ్మా..మీకు కావాల్సినవి తీసుకువస్తా అని చెప్పిన మా నాన్న ఎందుకు చనిపోయాడు అంటూ పిల్లలు ఏడుస్తున్న తీరు పలువురిని కలచివేసింది. -8లో



ఆర్టీసీ బస్సులు కిటకిట

సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో పిల్లా, పెద్దలు కలిసి స్వగ్రామానికి బయలుదేరి వెళుతున్నారు. దీంతో ఏ బస్సు చూసినా ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. -8లో

గరిష్టం/కనిష్టం
28.2/20.6

వాతావరణం

జిల్లాలో శనివారం 20.6 - 28.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

రేపు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ రద్దు

కడప కోటిరెడ్డి సర్కిల్: ఈ నెల 13వ తేదీన భోగి (ప్రభుత్వ సెలవు దినం) పండుగ కావడంతో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున అర్జీదారులు జిల్లా పోలీస్ కార్యాలయంలోని జిల్లా ఎస్పీ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమానికి రావొద్దని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

డీఈఓపై కమిషనర్‌కు ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ, మానసిక క్షోభకు గురి చేస్తున్న వైఎస్సార్ కడప జిల్లా విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి, ఎస్టీయేఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అంకాల కొండయ్య, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఎన్‌సీపీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.సుబ్బారెడ్డిలు కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజుకు ఫిర్యాదు చేశారు. 'ఈ డీఈవో మీనాక్షి మాకొద్దంటూ' జిల్లాలోని 27 ఉపాధ్యాయ సంఘాలు ముక్తకంఠంతో విభేదిస్తునాయని, ఆమెపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యాచరణకు సైతం సిద్ధమయ్యాయన్నారు. జనవరి 9 నుంచి 12 వరకు జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసి వినతి పత్రాలు సమర్పించడం, 23, 24వ తేదీలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలు, 28, 29వ తేదీల్లో రోజంతా నల్ల బ్యాడ్జీలతో బోధన చెప్పాలని, ఫిబ్రవరి ఒకటో తేదీన డీఈఓ కార్యాలయం ముట్టడి చేయాలని, 3, 4 తేదీలలో గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించాలని, 5-14వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు, 19న మాస్ క్యాజువల్ లీవ్, మార్చి 1వ తేదీ నుంచి ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టేలా ఉద్యమ కార్యాచరణ ప్రకటించాయని తెలియజేశారు.

వడ్డె ఓబన్న త్యాగం.. స్ఫూర్తిదాయకం



వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఆర్వో, అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: తొలితరం స్వాతంత్ర్యయోధుడు వడ్డె ఓబన్న త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వడ్డె ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ వడ్డె ఓబన్న ప్రస్తుత నంద్యాల జిల్లా సంజామల మండలంలోని నొస్సం గ్రామంలో జన్మించారన్నారు. ఆయన గ్రామ తలారీగా పని చేసేవారన్నారు. బ్రిటీషు పాలకుల విధానాల వల్ల తలారీల జీతాలు రద్దు కావడం, రైతులపై పన్నులభారం అధికం కావడంతో తిరుగుబాటు మొదలైందన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ తిరుగుబాటులో వడ్డె ఓబన్న క్రియాశీలకంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ అధికారి కృష్ణయ్య, సాంఘిక సంక్షేమశాఖ డీడీ సరస్వతి, స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, వడ్డెర సంఘ నాయకులు నారాయణ, రమణ, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరమాన్నం కాదు..
పప్పన్నమూ కరువే!

- సంక్రాంతి లేదు.. అంతా భ్రాంతి
- చిన్నబోయిన పెద్ద పండుగ
- నశించిన కొనుగోలు శక్తి
- పథకాలు లేక తగ్గిన రాబడి
- ప్రభుత్వ ఆదరణ లేక ప్రజల్లో నిరాసక్తత



కడప కల్చరల్: పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ప్రతి చోట సందడి కనిపించే పండుగ సంక్రాంతి. బోలెడు సంప్రదాయాలతో ఉత్సాహ భరిత వాతావరణం కనిపిస్తుంది. అందిరినీ ఉల్లాసంగా ఉంచే పర్వదినం. రైతన్న ఇంటినిండా ధాన్యం చేరుకుని ఉంటుంది గనుక.. వారిపై ఆధారపడ్డ కుటుంబాలన్నీ గుండెనిండా ఆనందంతో ఉంటాయి. బంధుజనంతో సంతోషం తాండవిస్తుంది. లేనివాడంటూ లేకుండా అందరూ కడుపునిండా తినే అవకాశం కల్పించే వేడుక ఇది.

ఇదంతా నిన్నటి వరకు నిజం.. నేడు ఓ జ్ఞాపకం.. ఐదేళ్లపాటు హాయిగా గుండెపై చేయి వేసుకుని కంటి నిండా నిదురపోయిన రైతుకు నేడు భరోసా లేకుండా పోయింది. ఇంటి నిండా ధాన్యం లేకపోగా, బతుకంతా దైన్యం నిండుకుంది. ప్రకృతి పరంగా వచ్చే కష్టనష్టాల్లో వెన్నంటి ఉండే ప్రభుత్వం తమను ఆదుకుంటుందన్న విశ్వాసం నేడు ఏ మూలన కనిపించడం లేదు. పంటకు పెట్టుబడి గానీ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో వస్తుందని ఆశించే ప్రభుత్వ సాయం మాటే లేదు. రైతుకు జీవితం పట్ల ఆశ రోజురోజుకు సన్నగిల్లుతోంది. ఇంత వరకు సాయంగా నిలిచిన ఏ పథకం ఎప్పుడు ఏ కారణంతో తీసేస్తారోనన్న భయం కుంగ దీస్తోంది. అమ్మ ఒడి ధైర్యంతో చిన్నారులు హాయిగా బడికి వెళ్లే వాతావరణం కరువై అమ్మల కంట తడి కనిపిస్తోంది. వసతుల కల్పనతో దీవించే ప్రభుత్వం లేకపోవడంతో.. విద్యార్థుల చదువు అగమ్య గోచరంగా మారింది. నేతన్న ఆకలి మంటలతో కష్టాలు, కన్నీళ్లతోనే కాలం గడుపుతున్నారు. ఇంటిని నిర్వహించగలనన్న ధీమాతో ఉండిన అక్కాచెల్లెమ్మలు ప్రోత్సాహం లేక దిగాలుగా మారారు. సమాజంలో ఏ మూలన చూసినా నిరాశ నిస్పృహలే. ఈ నేపథ్యంలో సంక్రాంతిలో క్రాంతి కనుమరుగై ప్రజల జీవితాల్లో భ్రాంతి మిగిలింది. దీంతో సమాజానికి వెన్నముకగా నిలుస్తున్న అన్నదాత నీరసించిపోయాడు. ఒకరికి అన్నం పెట్టగలిగిన చేతులు.. నేడు రిక్తహస్తాలుగా మిగిలాయి.

వాణిజ్య వర్గాల్లో తగ్గిన ఉత్సాహం

జిల్లా జీడీపీ గ్రోత్ రేట్‌లో కీలకమైన నిర్మాణ రంగం జిల్లాలో కుదేలైంది. గ్రాస్ వాల్యూ యాడెడ్(జీడీఏ)లో నిర్మాణ రంగం వాటా ఏడాదికి 46.30 కోట్ల రూపాయలుగా ఉంది. ఇది పారిశ్రామికరంగ వాటాలో 35.7 శాతంగా ఉంది. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులతోపాటు వివిధ భారీ నిర్మాణ పనులు నెమ్మదించిన కారణంగా.. ఆ మేరకు జీఎస్టీ పన్నుల్లో భారీ కోత కనిపిస్తోంది. అలాగే ట్రేడ్, హోటల్స్, ట్రాన్స్‌పోర్టు, రియల్ ఎస్టేట్ తదితర రంగాల్లో వృద్ధి రేటు కనిపించని కారణంగా ఆ ప్రభావం కూడా జీఎస్టీలో స్పష్టంగా కనిపిస్తోంది. పైపెచ్చు గత ఖరీఫ్ కాలంలో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. మినుము, వేరుశనగ, పత్తి, కంది తదితర వర్షాధార పంటలు నిలువునా ఎండిపోవడంతో.. రైతులు లక్షలాది రూపాయల పెట్టుబడులు నష్టపోవాల్సి వచ్చింది. రబీలో సైతం తుపానుల కారణంగా పంటలు బాగా దెబ్బతిన్నాయి. పైగా అరకొరగా వచ్చిన దిగుబడులు సైతం మద్దతు ధరలు అంతంత మాత్రంగానే ఉండటంతో రైతుల జేబుల్లో చిల్లిగవ్వ కూడా లేని పరిస్థితి నెలకొనడం వల్ల వ్యాపారాలు బాగా తగ్గాయి.

కొనలేం.. తినలేం..





ప్రజల్లో ఇటీవల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. కొత్త పథకాలు లేకపోగా ఉన్న పథకాలు తీసివేస్తుండటంతో.. ప్రభుత్వ సాయం నిలిచిపోయి సామాన్యుడు నిశ్చేష్టుడిగా మిగిలిపోతున్నాడు. నెలనెల క్రమం తప్పక వలంటీర్ ద్వారా ఉదయాన్నే గుండెను తట్టిలేపి.. గుప్పెట్లో వాలిపోయి సామాజిక పెన్షన్ పెరిగిందని సంతోష పడినా ఏ క్షణంలో ఏ కారణం చూపి ఎగ్గొడతారన్న భయం వెన్నాడుతూనే ఉంది. ఇంటి వద్దకు వచ్చి సరుకులు అందించే రేషన్ వాహనాలు ఎత్తేస్తారని వస్తున్న వార్తలను ప్రభుత్వం ఖండించకపోవడంతో ఆయా వర్గాల్లో నిరాశ పెరుగుతోంది. వాహనదారులు, రేషన్ పొందుతున్న ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రేషన్ వాహనాలను, చెత్త వాహనాలను ఎత్తివేస్తారని ప్రచారం సాగుతుండటంతో.. వాటిపై జీవిస్తున్న బడుగులకు ఇక పిడుగులు తప్పవన్న భయం నెలకొన్నది. దీంతోపాటు రోజురోజుకు ఆకాశం నుంచి దిగి రానంటున్న ధరలతో సామాన్య, మధ్యతరగతికి చెందిన ప్రజలు కనీసం కూరగాయలు కొనలేని స్థితిలోకి దిగజారాడు.

కొనుగోళ్లు లేక వ్యాపారులు డీలా



ప్రభుత్వ సాయం పూర్తిగా లేకపోవడం, రైతులు ఉత్పత్తులు చేసేందుకు సహకారం లేకపోవడంతో ప్రజలకు ఆదాయం లేక కొనుగోలుశక్తి నానాటికీ నశిస్తోంది. పెద్ద పండుగగా భావించే సంక్రాంతికి నాలుగైదు రోజుల ముందు నుంచి మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడతాయి. సీజన్‌లో చిన్న దుకాణాలు సైతం లక్షల వ్యాపారం చేసేవి. నేడు కరెంటు ఖర్చులు బరువేనని వ్యాపార వర్గాలు విలవిల్లాడుతున్నాయి. కానీ ప్రస్తుతం దాదాపు దుకాణాలన్నీ వెలవెలబోతున్నాయి. సచివాలయ వలంటీర్లతోపాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో అధికశాతం మందిని ఎలాంటి నోటీసులు లేకుండా తొలగిస్తుండడంతో ఇటీవలి పదిహేనేళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగులు ఎక్కువయ్యారు. దీంతో పండుగ పూట కనీసం కడుపు నిండా తినే అవకాశం లేకుండా పోయింది. నిత్యావసర సరుకుల్లో ఒకటి, రెండు మినహా దాదాపు అన్నీ రూ.150-400లకు పెరిగాయి. ఈ నేపథ్యంలో పండుగ సంగతి అటుంచితే పచ్చడి మెతుకులు కరువేనంటూ రైతన్న వెన్ను విరిగి నేల కూలాడు. ఈ స్థితిలో బిడ్డలను, బంధుమిత్రులను ఇంటికి ఆహ్వానించి పండుగ సంతోషాన్ని పంచుకునే పరిస్థితి లేదు. అంతటా నిరాశ నిస్పృహలు తాండవిస్తుండగా, సగటు మనిషి పండుగను ఏమాత్రం ఆస్వాదించలేక పోతున్నాడు.

నాడు ఆర్థికంగా ఆసరా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా సమాజంలోని చిన్న వర్గాలన్నీ పలు పథకాలతో ఆర్థికంగా ఆసరా లభించి ఆనందంగా గడిపాయి. డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా 9,82,554 మందికి 27 ప్రభుత్వ పథకాల ద్వారా రూ.8,857.42 కోట్ల నగదు చేరింది. దాంతో సామాన్యుడు సైతం కొనుగోలు శక్తితో పండుగ సంతోషంగా చేసుకునేవారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో కొత్త పథకాల ద్వారా ఆర్థికంగా మరింత వెసులుబాటు లభిస్తుందని ఆశించినా చివరికి నిరాశే మిగిలింది. నాడు లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించడాన్ని గుర్తు చేసుకుంటూనే.. రోజుకో శాఖ నుంచి తొలగింపబడిన ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు నిరుద్యోగులుగా మిగిలిపోయి దిక్కుతోచని స్థితికి చేరారు. ఉన్న ఉపాధి సైతం కోల్పోవడంతో పండుగ కడుభారంగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదవాడి బతుకు దుర్భరం



ప్రభుత్వ పథకాల సహకారంతో పేదవాడు ఈ ఐదేళ్ల పండుగలా గడిపాడు. ప్రస్తుతం ధరలు మునిపెన్నడూ లేనంత పెరిగాయి. కొనుగోలు శక్తి తగ్గడంతో పప్పన్నానికి కూడా కరువయ్యే ప్రమాదం ఏర్పడింది.

- రమణయ్య, కడప

ఆకాశాన్నంటిన ధరలు



గతంలో ఎన్నడూ లేని విధంగా మార్కెట్లో అన్ని నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆదాయం తక్కువ.. ఖర్చు ఎక్కువ అయిపోయింది. ధరలు బాగా పెరిగిపోవడంతో ఏమీ కొనలేక పోతున్నాం. ఇలాగైతే ఎలా బతకాలో అర్థం కావడం లేదు.

- నక్కా వెంకట లక్ష్మమ్మ, వేంపల్లె

పండగ లేదు.. పబ్బం లేదు



పంటల సాగు కోసం వేలకు వేలు తెచ్చి ఖర్చు పెట్టి మూడు ఎకరాల్లో శనగపంట, రెండు ఎకరాల్లో మినుము పంట వేశాను. దిగుబడి నాటికి తెగుళ్లతో పంట మొత్తం దెబ్బతిని సాగు ఖర్చులు కూడా చేతికి రాలేదు. ఇక ఈ ఏడాది సంక్రాంతికి పండగ లేదు, పబ్బం లేదు.

- ఆదినారాయనరెడ్డి, రైతు, కోనాయపల్లె గ్రామం, పెండ్లిమర్రి మండలం

'ఎంతో ఆప్యాయంగా పలుకరించే మీ చిరునవ్వే లేదనే ఊహే చాలా బాధగా ఉంది. మీరు లేని లోటు ఎవరూ తీర్చలేనిది' అంటూ.. వైఎస్ అభిషేక్‌రెడ్డికి కన్నీటి వీడ్కోలు పలికారు. కడచూపు కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున తరలివచ్చి బరువెక్కిన హృదయాలతో నివాళులర్పించారు. 'నిను మరువలేమంటూ' ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.



కన్నీటి వీడ్కోలు

- భారీగా తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించిన ప్రజలు
- శోకసంద్రంలో మునిగిన వైఎస్ కుటుంబ సభ్యులు
- వైఎస్ అభిషేక్ పార్థివదేహం వద్ద నివాళులర్పించిన వైఎస్ జగన్ దంపతులు
- ప్రత్యేక ప్రార్థనల అనంతరం అంతిమయాత్ర ప్రారంభం
- ఇంటి వద్ద నుంచి సమాధుల తోట వరకు కదిలిన ఆత్మీయులు, బంధువులు





పులివెందులలో వైఎస్ అభిషేక్‌రెడ్డి అంతిమయాత్ర, పాల్గొన్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు

సాక్షి కడప: వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి మరణం వైఎస్ కుటుంబ సభ్యులను కుంగ దీసింది. మరణ వార్త తెలిసినప్పటి నుంచి శోకసంద్రంలో మునిగిపోయారు. యుక్త వయసులో ఉన్న అభిషేక్‌రెడ్డి మరణాన్ని వారు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రధానంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైద్య విభాగంలో పని చేస్తూ నియోజకవర్గంతోపాటు జిల్లా వ్యాప్తంగా అందరితో మంచి పరిచయాలు ఉండటంతో.. భారీగా అభిమానులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. పులివెందులలోని దినేష్‌మెడికల్ సెంటర్‌లో వైద్యులుగా సేవలు అందిస్తూ అనేక మంది హృదయాల్లో అత్యుత్తమ వైద్యునిగా స్థానం సంపాదించారు.

విషణ్ణ వదనంలో..

వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతితో వైఎస్ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. అనారోగ్యంతో అభిషేక్‌రెడ్డి హైదరాబాదులోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆయన భౌతిక కాయాన్ని పులివెందులలోని నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజలు సందర్శించి జోహార్లు అర్పించారు. వైఎస్ అభిషేక్‌రెడ్డికి నివాళులర్పించిన అనేక మంది కన్నీటి పర్యంతమయ్యారు. అభిషేక్‌రెడ్డి భార్య డాక్టర్ వైఎస్ సౌఖ్య ఆద్యంతం భర్తను స్మరించుకుంటూ కన్నీటి పర్యంతమయ్యారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెమర్చిన కళ్లతో కనిపించగా, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతిరెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. మనవడి మృతితో వైఎస్ ప్రకాశ్‌రెడ్డి, ఆయన సతీమణి వైఎస్ పద్మావతమ్మ మొదలుకొని తండ్రి వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, తల్లి మాధవి, సోదరుడు అభినవ్‌రెడ్డిలు బోరున విలపించారు. అలాగే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ ఆనంద్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ జోసెఫ్‌రెడ్డి తదితరులు విషణ్ణ వదనంలో కనిపించారు. వీరే కాకుండా ఈసీ దినేష్‌రెడ్డి, ఇతర వైఎస్ కుటుంబ సభ్యులందరూ వైఎస్ అభిషేక్ పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. మాజీ సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతిరెడ్డి దంపతులు ముందుగా పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం చిత్రపటం వద్ద కూడా పుష్పాల అంజలి ఘటించారు.

ప్రముఖుల నివాళి

పార్టీలకు అతీతంగా నేతలు వచ్చి పుష్పాంజలి అర్పించారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, తాడిపత్రి కేతిరెడ్డి పెద్దారెడ్డి, రఘురామిరెడ్డి, డాక్టర్ సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పుత్తా నరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, అనంతపురం వైఎస్సార్‌సీపీ నేత వెన్నపూస రవీంద్రారెడ్డి తదితరులు నివాళులర్పించారు.

అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న స్వగృహం నుంచి వైఎస్ అభిషేక్‌రెడ్డి అంతిమయాత్ర కన్నీటి సుడుల మధ్య కొనసాగింది. పార్థికదేహం గల వాహనం ముందుగా పాస్టర్లు దేవుని వ్యాక్యాలు వినిపిస్తూ ముందుకు సాగారు. ఇంటి వద్ద నుంచి అంబకపల్లెరోడ్డు, పాత ఆర్టీసీ బస్టాండు సర్కిల్, మెయిన్‌రోడ్డు మీదుగా లయోల డిగ్రీ కళాశాల దారిలోని వైఎస్ సమాధుల తోట వరకు కొనసాగింది. అలంకరించిన వాహనంలో ఉన్న వైఎస్ అభిషేక్‌రెడ్డి పార్థివదేహంపై ఒకవైపు పూలు చల్లుతుండగా.. మరోవైపు వైఎస్ అభిషేక్ అమర్‌రహే అంటూ పలువురు నినాదాలు చేశారు. అంతిమయాత్రలో మాజీ సీఎం వైఎస్ జగన్‌తోపాటు భారీగా ప్రజలు పాల్గొని తుది వీడ్కోలు పలికారు. సమాధుల తోటలో సంప్రదాయ బద్ధంగా కార్యక్రమాలు నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు.

'నాన్న.. లే నాన్న'



డాక్టర్‌గా ఎందరో ప్రాణాలు కాపాడిన వైఎస్ అభిషేక్‌రెడ్డి.. అక్కడ ఫ్రీజర్‌లో విగత జీవిగా ఉన్నాడు. 'నాన్న లే నాన్న' అంటూ ఆయన కుమార్తెలు వైఎస్ అక్షర, వైఎస్ అకర్ష బోరున విలపించారు. తండ్రి ఇక లేడని, పలకలేడని తెలియని పసి హృదయాల రోదన అక్కడున్న అందరినీ కలచివేసింది. -పులివెందుల రూరల్

వైఎస్ సుశీలమ్మను పరామర్శించిన వైఎస్ జగన్



మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి సోదరుడు వైఎస్ ఆనంద్‌రెడ్డి భార్య వైఎస్ సుశీలమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం వారి ఇంటికి వెళ్లి సుశీలమ్మను పరామర్శించారు.



వైఎస్ అభిషేక్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పి.రవీంద్రనాథరెడ్డి



ఎమ్మెల్యే సుధ



అంజద్ బాషా



రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



మేయర్ సురేష్‌బాబు



బీటెక్ రవి



వైఎస్ కుటుంబ సభ్యులతో పుత్తా నరసింహారెడ్డి

యువోత్సాహం..!

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న జిల్లా యువత
- ఏటా పార్లమెంట్‌లో ఉపన్యసించే అవకాశం



సానియా



దస్తగిరి బాషా



లోహిత్‌ఈశ్వర్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: స్వామి వివేకానందుడు చూపిన మార్గంలో నడుస్తూ జిల్లాకు చెందిన యువత వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఏటా జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా పార్లమెంటులో ప్రసంగించే అవకాశాన్ని మన జిల్లా నుంచి ఒకరికి దక్కుతుండటం విశేషం. 2002లో జిల్లాకు చెందిన రూపా, 2003లో అరుణ, 2004లో సానియాలు పాల్గొని పార్లమెంటులో ఉపన్యసించారు. దీంతోపాటు ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహిస్తున్న నేషనల్ యూత్ డైలాగ్ కార్యక్రమానికి సైతం జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. కడప నగరానికి చెందిన సానియా, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి చెందిన లోహిత్‌ఈశ్వర్‌రెడ్డి, ప్రొద్దుటూరు దస్తగిరి బాషా ఎంపికయ్యారు.

క్లుప్తంగా

కొండాపురంలో చోరీ

కొండాపురం : మండల కేంద్రంలోని పాత కొండాపురానికి చెందిన రంగాంజినేయులు ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు శనివారం పగలు చోరీ చేశారు. బాధితుడి వివరాల మేరకు తాను తాడిపత్రికి వెళ్లగా తన భార్య నాలుగు రోడ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుగుతున్న చోటకు పనికి వెళ్లిందన్నారు. కూలి పనులు ముగించుకొని ఇంటి వద్దకు రాగా తలుపు తెరచి ఉందన్నారు. లోపలికి వెళ్లి చూడగా రూ.36 వేలు నగదు, రెండు జతల కమ్మలు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గుర్తించామన్నారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

రూ.20వేలు ఎత్తుకెళ్లారు..

ముద్దనూరు : ముద్దనూరు మండల కేంద్రంలో స్టేట్ బ్యాంకు వెనుక వీధిలో ఓ ఇంటిలో శనివారం పగలు చోరీ జరిగింది. ఇంటిలోని వారు తలుపులు వేసి ఓ శుభకార్యానికి వెళ్లిన సమయంలో తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న రూ.20వేల నగదు ఎత్తుకెళ్లినట్లు సమాచారం. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని బొగుడుపల్లి రింగ్ రోడ్డు సమీపంలో విజయ్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భాకరాపురంలో నివాసం ఉంటున్న ఇతను శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో రింగు రోడ్డు సమీపంలోని రోడ్డులో పడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గుర్తుతెలియని వాహనం ఏదైనా ఢీకొందా లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు- లారీ ఢీ


ప్రమాదంలో పగిలిన బస్సు ముందువైపు అద్దం

ముద్దనూరు : ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో ఓబుళాపురం గ్రామ సమీపంలో శనివారం సాయంత్రం ఎదురెదురుగా ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు–లారీ ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు, లారీ అద్దం పగిలిపోయాయి. ప్రొద్దుటూరు డిపోకు చెందిన బస్సు తాడిపత్రి నుంచి ప్రొద్దుటూరు ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తు ప్రయాణికులెవరికీ ఎటువంటి గాయాలు కాలేదని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

భయం వద్దు.. జాగ్రత్త ముద్దు!

- ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రిలో హెచ్ఎంపీవీ ఐసోలేషన్ వార్డు ఏర్పాటు
- వైద్యులను అప్రమత్తం చేసిన అధికారులు
- జాగ్రత్తలు ముఖ్యమంటున్న వైద్యులు


జిల్లా ప్రభుత్వాసుపత్రి


జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డు

ప్రొద్దుటూరు క్రైం : కరోనా మహమ్మారి తర్వాత చైనాలో కొత్త వైరస్ కలకలం రేపుతోంది. హ్యూమన్ మెటాప్‌న్యూమో వైరస్ (హెచ్ఎంపీవీ) మన దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో వ్యాప్తిలో ఉందని, దానికి సంబంధించిన కేసులు కూడా నమోదైనట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. కోవిడ్ లాగానే హెచ్ఎంపీవీ వ్యాప్తి ఉంటుందని దీనిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. ఈ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్ఫెక్షన్ల మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు వెల్లడించారు. దగ్గు, జ్వరం, ముక్కు దిబ్బడగా అనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటుందని, వ్యాధి లక్షణాలు బయటకి కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుందని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు వైద్యులతో మాట్లాడారు. హెచ్ఎంపీవీ అనుమానిత కేసులు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యులకు సూచనలు చేశారు. కేసులు పెరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ మేరకు ఆయన ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డును పరిశీలించారు. వార్డులో 15 బెడ్లను ఏర్పాటు చేశారు. వైద్యులు, సిబ్బందికి కావలసిన గ్లౌజ్‌లు, మాస్క్‌లు, ఇతర కిట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

చిన్న పిల్లలు, వృద్ధుల్లో ప్రభావం

ప్రస్తుత పరిస్థితుల్లో హెచ్ఎంపీవీ గురించి భయపడాల్సిన పని లేదని వైద్యులు చెబుతున్నారు. అయినప్పటికీ చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. దగ్గు, జ్వరం, ముక్కు కారటం, గొంతునొప్పి, శ్వాసతీసుకోవడంలో ఇబ్బందిగా ఉండటం, శరీరంపై దద్దుర్లు తదితరవి వైరస్ లక్షణాలు. కొన్ని సార్లు ఇది తీవ్ర ప్రమాదాన్ని కూడా కలిగిస్తుంది. న్యుమోనియా, ఆస్తమా, చెవి ఇన్‌ఫెక్షన్‌కు కూడా దారి తీస్తుంది. చిన్న పిల్లలు, వృద్ధులు, క్యాన్సర్ రోగుల్లో తీవ్ర నష్టాన్ని ఈ వైరల్ కలిగిస్తుంది. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న వారిలో జలుబుతో పాటు న్యుమోనియా వస్తుంది. చలి కాలంలో పిల్లలు ఆస్పత్రుల్లో చేరి చికిత్స చేయించుకోవాల్సి వస్తుందని వైద్యులు తెలిపారు. ఏ రకమైన వైరస్‌ను అయినా సంక్రమించే ప్రమాదాన్ని నివారించడానికి, తగ్గించడానికి కొన్ని విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు పాటిస్తే చాలు

- చేతులను సబ్బు నీటితో శుభ్రంగా కడగాలి. చేతులు కడుక్కోవడానికి సాధ్యం కానప్పుడు శానిటైజర్‌ను వాడాలి.
- బయటికి వెళ్లేటప్పుడు ముక్కు, నోటిని కవర్ చేసేలా మాస్క్ ధరించాలి
- దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు చేతులను అడ్డం పెట్టుకోవాలి
- జలుబు, ఇతర అంటువ్యాధులు ఉన్న వారికి దూరంగా ఉండాలి. పిల్లల దగ్గరికి అలాంటి వారిని వెళ్లనీయకుండా చూడాలి.
- సమస్య ఉన్నప్పుడు పిల్లలను స్కూల్స్, కాలేజీలకు పంపొద్దు
- శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్, న్యుమోనియా, ఆస్తమా, దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడేవారు రెగ్యులర్‌గా మందులు వాడాలి.

ఆస్పత్రిలో మందులు సిద్ధంగా ఉన్నాయి

హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నాం. ఇప్పటి వరకు ఈ వైరస్ లక్షణాల కేసు బయటపడలేదు. ఒక వేళ కేసులు వచ్చినా ట్రీట్‌మెంట్ చేయడానికి సిద్ధంగా ఉన్నాం. అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. 15 బెడ్లతో ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశాం. ఎవరూ భయపడాల్సిన పని లేదు. ఇది కూడా ఫ్లూ లాంటి వైరసే. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

– డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు.

మెలకువలతో ఆరోగ్యకరమైన లేగదూడలు

వల్లూరు (చెన్నూరు) : లేగదూడలను పెంచడంలో మెలకువలు పాటించడం ద్వారా ఆరోగ్యకరమైన లేగదూడలు పెరుగుతాయని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ సి.శారదమ్మ తెలిపారు. మండలంలోని నరసారెడ్డిపల్లెలో శనివారం డీపీఎల్ డీపీ కడప వారి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పాడి రైతులు లేగ దూడల పెంపకంలో మెలకువలు పాటించినట్లయితే దూడలు ఆరోగ్యవంతంగా పెరుగుతాయన్నారు. ప్రదర్శనలో పాల్గొన్న 42 దూడలను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులురెడ్డి, డీపీఎల్‌డీపీ డాక్టర్లు, పాడి రైతులు పాల్గొన్నారు.

రవాణాశాఖ అధికారుల తనిఖీలు


ప్రైవేట్ ట్రావెల్స్ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శ్రీనివాసులరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రవాణాశాఖ అధికారులు పలు ప్రైవేట్ ట్రావెల్స్‌పై శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. పర్మిట్ లేకుండా తిరుగుతున్న రెండు ట్రావెల్స్‌కు రూ. 5.24 లక్షలు జరిమానా విధించారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా సరుకు రవాణా చేస్తున్న రెండు బస్సులకు రూ. 20 వేలు, ఎఫ్‌సీ లేని మరో బస్సుకు రూ. 5 వేలు జరిమానా విధించినట్లు ఆర్టీఓ మురళీధర్ తెలిపారు.

ట్రెజరీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన వారిని సన్మానిస్తున్న ట్రెజరీ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గ ఎన్నిక శనివారం కడపలో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షునిగా జె.ప్రభుదాస్, అసోసియేట్ అధ్యక్షునిగా ఎస్.రవిశేఖర్, ఉపాధ్యక్షులుగా పి.ఉదయశంకర్‌రెడ్డి, ఎన్.తిరుపతిస్వామి, డి.రబియాబేగం, కార్యదర్శిగా ఎ.ఉదయకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా జె.ధీరజ్, జాయింట్ సెక్రటరీలుగా పి.ఉదయ నరసింహ, ఎస్.పవన్‌కుమార్, ఆర్ఎల్‌వీ మనోజ్ఞ, ట్రెజరర్‌గా హరహరపుత్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎస్.గోపాల్, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా ఓ.సాయికుమార్, పరిశీలకునిగా పి.వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

కారు పల్టీ కొట్టి ఎనిమిది మందికి గాయాలు




పల్టీ కొట్టిన కారు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని పోలిబుచ్చయ్యగారిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం కారు పల్టీ కొట్టిన ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం, తిప్పాయపల్లి గ్రామస్తులు వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలంలోని బంధువుల ఇంటికి వెళ్లి పుల్లంపేటకు తిరుగు ప్రయాణమయ్యారు. మండల పరిధిలోని పోలుబుచ్చయ్యగారిపల్లి గ్రామం వద్ద షిఫ్ట్ డిజైర్ కారు అతివేగంతో వస్తూ అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఐదుగురు పెద్దలు, ముగ్గురు చిన్నపిల్లలకు గాయాలయ్యాయి. వీరిలో హిమబిందు (22) అనే మహిళ తలకు, కాలికి బలమైన రక్తగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసులు నేషనల్ హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు.

కన్నబిడ్డలను కాటేసిన తండ్రి అరెస్టు


బోయకొండ (ఫైల్)

మదనపల్లె : కన్న కూతుళ్లపై అఘాయిత్యానికి పాల్పడిన కసాయి తండ్రిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ డి.కొండయ్యనాయుడు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...నిమ్మనపల్లె మండలం కొండయ్యగారిపల్లె పంచాయతీ వెంకోజిగారిపల్లె దాసరిపేటకు చెందిన చెన్నూరుబోయకొండ(30) కూలి పనులకు వెళుతూ, కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసి మద్యానికి బానిసయ్యాడు. దీంతో అతడి భార్య చిట్టెమ్మ జీవనోపాధి కోసం ఊరురా తిరుగుతూ గాజులు విక్రయించేంది. వీరికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తల్లి ఇంటిపట్టున లేకపోవడంతో అమ్మమ్మ పిల్లల బాగోగులు చూసుకునేది. ఈనెల 6వ తేదీన బోయకొండ ఇద్దరు కూతుళ్ల కడుపునొప్పి తాళలేకపోతున్నామంటూ అమ్మమ్మ, మేనమామతో చెప్పుకున్నారు. వారు ఎందుకని ఆరా తీయగా, తండ్రి చేసిన అఘాయిత్యాన్ని వివరించారు. దీంతో వారు సమాచారాన్ని తల్లి చిట్టెమ్మకు తెలపడంతో ఆమె నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో భర్త బోయకొండపై ఫిర్యాదు చేసింది. రూరల్ సర్కిల్ సీఐ రమేష్ ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ప్రాథమికంగా తండ్రి బోయకొండ బిడ్డలపై అఘాయిత్యానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు విచారణ చేశారు. నిందితుడు బోయకొండను శనివారం అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ఆర్టీసీ బస్సులు కిటకిట

ప్రయాణికులతో నిండిన బస్టాండ్


కడప బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు కిక్కిరిసిన జనం

కడప కోటిరెడ్డి సర్కిల్ : తెలుగు వారి పెద్ద పండుగల్లో సంక్రాంతి ఒకటి. ఈ పండుగకు ఎక్కడ ఉన్నా ప్రతి కుటుంబం వారి, వారి ఊళ్లకు వెళ్లి సరదాగా గడపడం ఆనవాయితీగా వస్తోంది. తమ స్వస్థలాలకు వెళ్లాలంటే ప్రతి ఒక్కరూ దాదాపుగా ఆర్టీసీ బస్సులపైనే ఆధారపడుతున్నారు. సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో పిల్లా, పెద్దలు కలిసి స్వగ్రామానికి బయలుదేరి వెళుతున్నారు. దీంతో ఏ బస్టాండు చూసినా ప్రయాణికులతో నిండిపోయింది. ఏ బస్సు చూసినా ప్రజలతో కిటకిటలాడుతోంది. పండుగ కోసం వారి, వారి స్వగ్రామాలకు వెళ్లే ప్రయాణికుల కోసం అన్ని డిపోల నుంచి బస్సులను సమకూర్చారు. ఇందులో జిల్లా నుంచి బయటి ప్రాంతాలకు, జిల్లాలోనూ ప్రయాణికులను చేర వేసేందుకు మొత్తం 260 బస్సులను ఏర్పాటు చేశారు. కడప నుంచి నెల్లూరు, తిరుపతి, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, కావలితోపాటు బెంగళూరు, చెన్నై, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. కడప రీజినల్ మేనేజర్ పోలిమేర గోపాల్‌రెడ్డి రెండు రోజులుగా అన్ని డిపోల మేనేజర్లను, ట్రాఫిక్ అధికారులను అప్రమత్తం చేసి బస్సు ప్రయాణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఏదైనా మార్గ మధ్యంలో బస్సులు మొరాయిస్తే వాటి స్థానంలో ఇతర బస్సులను పంపించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. హైదరాబాద్ నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వచ్చే వారి కోసం హైదరాబాద్‌లో 15 స్టాపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి సిబ్బందిని కూడా నియమించి ప్రయాణికులకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా బెంగళూరు నుంచి జిల్లా నలుమూలలకు ప్రయాణికులు చేరుకోవడానికి ఏర్పాట్లు చేశారు. విజయవాడ నుంచి విద్యార్థులు రావడానికి కూడా బస్సులను సమకూర్చారు. ప్రయాణికుల రద్దీ పెరిగేకొద్దీ అదనపు బస్సులను ఏర్పాటు చేస్తామని ఆర్ఎం గోపాల్‌రెడ్డి తెలిపారు.

కాలువలో జారిపడి బాలుడి గల్లంతు


జస్వంత్ (ఫైల్)

రాజుపాళెం : అభం శుభం తెలియని ముగ్గురు పిల్లలు ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి అందులో ఒక బాలుడు గల్లంతైన సంఘటన రాజుపాళెం మండలంలోని పగిడాల గ్రామంలో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పగిడాల గ్రామానికి చెందిన పందిటి వెంకటయ్యకు ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటయ్య కుమారుడితో పాటు అతని అన్న కుమారులు, జస్వంత్ కలిసి ఆడుకుంటూ ఇంటి సమీపంలోని కేసీ చాపాడు కాలువలో జారి పడ్డారు. నీటిలో కొట్టుకు పోతున్న జస్వంత్ (9) ను కాపాడేందుకు మిగతా ఇద్దరు పిల్లలు శాయశక్తులా ప్రయత్నించినా దొరకలేదు. వెంటనే ఈ సమాచారాన్ని తల్లిదండ్రులకు, గ్రామస్తులకు తెలియజేశారు. వారితో పాటు పోలీసులు, ప్రొద్దుటూరు ఫైర్ స్టేషన్ అధికారులు తమ సిబ్బందితో కాలువలో గాలించారు. అయినా బాలుడి ఆచూకీ కనిపించలేదు. కాలువలో గల్లంతైన బాలుడు జస్వంత్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్నాడు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దారి దోపిడి కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడు ఇండ్ల కుమార్ రాజా

దువ్వూరు : హైవే రోడ్డుపై ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ చాగలమర్రి మండలం గొడిగనూరు గ్రామానికి చెందిన ఇండ్ల కుమార్ రాజా వీ5 విలేకరిగా చెప్పుకుని మండలంలోని ఇడమడక గ్రామ సమీపంలో హైవే రోడ్డుపై ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లను బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నాడన్నారు. ఒక్కో ట్రాక్టర్ నుంచి రూ.5వేలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దువ్వూరు వై జంక్షన్‌లో శనివారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

నవీన్‌బాబుకు ఉత్తమ ప్రతిభా పురస్కారం


ప్రతిభా పురస్కారం అందుకుంటున్న నవీన్ బాబు


కడప కోటిరెడ్డి సర్కిల్ : బ్రహ్మంగారిమఠం మండలం తోట్లపల్లి గ్రామానికి చెందిన రైల్వే తపాలా ఉద్యోగి జి.నవీన్ బాబుకు రైల్వే మెయిల్ సర్వీస్ క్యాటగిరిలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రతిభా పురస్కారం వరించింది. ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ వారు రాష్ట్ర వ్యాప్తంగా గత సంవత్సరం డిసెంబర్ నెలలో నిర్వహించిన తపాలా జీవిత బీమా ప్రత్యేక డ్రైవ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తపాలా ఉద్యోగులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. విజయవాడలో ప్రత్యేకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోస్టల్ సర్వీసెస్ బోర్డు మెంబర్ కె.ప్రకాష్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. నవీన్ బాబును పలువురు రైల్వే అధికారులు, ఉద్యోగులు అభినందించారు.

పండక్కి ఊరికి వస్తానంటివే.!

- గోడ కూలి హిటాచీ డ్రైవర్ దుర్మరణం
- స్పిన్నింగ్‌మిల్లు పాత భవనాలను కూలదోస్తుండగా ఘటన
- పనిచేస్తున్న వాహనంలోనే పోయిన ప్రాణం


ప్రమాదానికి కారణమైన హిటాచీ వాహనం


రమేష్‌రెడ్డి, ప్రవీణ దంపతులు(ఫైల్)


హిటాచీలో రక్తమోడుతున్న డ్రైవర్ రమేష్‌రెడ్డి మృతదేహం

మదనపల్లె : ఈరోజు పనిచూసుకుని పండక్కి ఇంటికి వచ్చేస్తానమ్మా.. అమ్మను ఇబ్బంది పెట్టకండి. చక్కగా చదువుకోండి. వచ్చేటప్పుడు మీకు కావాల్సినవి తీసుకువస్తా అని చెప్పిన మా నాన్న ఎందుకు చనిపోయాడు అంటూ పిల్లలు ఏడుస్తున్న తీరు ప్రభుత్వాసుపత్రిలో పలువురిని కలచివేసింది. మదనపల్లె మండలం సీటీఎం స్పిన్నింగ్ మిల్లులో పాత భవనాలను తొలగిస్తుండగా, ప్రమాదవశాత్తు భవనం గోడ హిటాచీ వాహనం మీద పడి డ్రైవర్ వాహనంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన శనివారం జరిగింది. గోడ ఒక్కసారిగా వాహనం మీద పడటంతో డ్రైవర్ శరీరం వాహనంలో ఇరుక్కుపోయి రక్తసిక్తమైంది. వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం కుమారునిపల్లెకు చెందిన నారాయణరెడ్డి, జయమ్మ దంపతుల కుమారుడు ఎస్.రమేష్‌రెడ్డి(40) హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఉపాధి నిమిత్తం కదిరి పట్టణం అడపాలవీధి పంచాయతీ కార్యాలయం సమీపంలో నివసిస్తున్నాడు. ఇతనికి భార్య ప్రవీణ, కుమార్తెలు సాహితి(13), భవ్యశ్రీ(11), కుమారుడు రోచన్‌రెడ్డి(4) ఉన్నారు. స్థానికుడైన ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ యజమాని, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వద్ద 15 ఏళ్లుగా రమేష్‌రెడ్డి హిటాచీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండునెలల క్రితం సీటీఎం స్పిన్నింగ్ మిల్లు భవనాల తొలగింపు, చదును పనుల కోసం రమేష్‌రెడ్డి ఇక్కడకు వచ్చి పని చేస్తున్నాడు. పనులు దాదాపు చివరిదశకు చేరుకున్నాయి. కేవలం ఐదురోజుల పని మాత్రమే మిగిలి ఉంది. ఈ క్రమంలో శనివారం పనిచేసి, పండుగకు ఇంటికి వస్తానని రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులకు శుక్రవారం రాత్రి ఫోన్ చేసి చెప్పాడు. అయితే శనివారం ఉదయం హిటాచీతో స్పిన్నింగ్ మిల్లులోని పాత భవనాన్ని తొలగిస్తుండగా, శిథిల స్థితిలో ఉన్న పెద్దగోడ అటువైపు పడుతుందనే ఆలోచనతో, హిటాచీతో నెట్టుతుండగా, ప్రమాదవశాత్తు వాహనం మీద పడిపోయింది. డ్రైవర్ సీటులో ఉన్న రమేష్‌రెడ్డి అక్కడికక్కడే దుర్మరణం పాలై గోడ శిథిలాల కింద చిక్కుకుపోయి రక్తమోడుతూ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. ప్రమాదంలో హిటాచీ వాహనం ధ్వంసమైంది. గమనించిన తోటిపనివారు పోలీసులకు, కాంట్రాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, పోలీస్ సిబ్బంది, స్థానికుల సహాయంతో శిథిలాలను తొలగించి, వాహనంలో ఇరుక్కుపోయిన రమేష్‌రెడ్డి మృతదేహాన్ని బయటకు తీశారు. ఘటనకు సంబంధించిన వివరాలను అక్కడ ఉన్న వారిని అడిగి తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. రమేష్‌రెడ్డి భార్య ప్రవీణ ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా, సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని రమేష్‌రెడ్డి మృతదేహాన్ని చూసి తల్లడిల్లిపోయారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న యజమాని గుర్తుపట్టలేని స్థితిలో శవమై పడి ఉండటాన్ని చూసిన భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టీడీపీలో రేషన్ షాపు చిచ్చు

రైల్వేకోడూరు అర్బన్ : ఓబులవారిపల్లి మండలం గాదెల వెంకటాపురం రేషన్ షాపు కేటాయింపు వ్యవహారం టీడీపీలో చిచ్చురేపింది. గత టీడీపీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథనాయుడుకు చెందిన టీడీపీ కార్యాలయంలో ఓబులవారిపల్లి మాజీ జెడ్పీటీసీ నాయుడోరి రమణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డిపై ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జి రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు రేషన్‌షాపు కేటాయించారని ఆరోపించారు. గత ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీకి ఏజెంట్‌గా ఉన్న చిన్నరెడ్డయ్యకు రేషన్ షాపు ఇప్పించి టీడీపీ కార్యకర్త అయిన ఆదినారాయణకు ద్రోహం చేయడంలో ఆంతర్యమేమిటో చెప్పాలని ప్రశ్నించారు.